సాక్షి జనగామ

బుధవారం | 2 | అక్టోబర్ | 2024

న్యూస్‌రీల్

ప్రజానాయకుడు శ్రీనివాస్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



జనగామ రూరల్: ప్రజానాయకుడు శ్రీనివాస్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం పట్టణంలోని ధర్మకంచలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన బొట్ల శ్రీనివాస్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం.. శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, మున్సిపల్ సీపీఎం ఫ్లోర్ లీడర్‌గా జనగామ ప్రజలు, ప్రజాఉద్యమాలకు ఎనలేని సేవలు అందించిన గొప్ప నాయకుడు శ్రీనివాస్ అన్నారు. జనగామ జిల్లాలో జరిగిన ఎస్‌రెడ్డి నగర్ పోరాటం, భూపోరాటాల్లో ముఖ్య పాత్ర పోషించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదలపై ప్రతాపం చూపించడం సరికాదని, పేదలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, నాయకులు ఎస్. వాసుదేవరెడ్డి, అముదాల మల్లారెడ్డి, ఎండీ దస్తగిరి ఎండీ జహంగీర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యం



జనగామ రూరల్: తరచూ రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటామని జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. మంగళవారం స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా జిల్లా ఆస్పత్రిలోని రక్త నిధి కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గోపాల్‌రావు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల శరీరంలో శుద్ధి జరిగి ఆరోగ్యవంతంగా ఉంటామని, యువకుల్లో ఉన్న అపోహలు తొలగించుకోవాలని సూచించారు. వివిధ సంస్థల నుంచి దాతలు పాల్గొని 31 యూనిట్ల రక్తదానం చేసినట్లు రక్త నిధి అధికారి డాక్టర్ కరుణాకర్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అన్వర్, ఆర్‌ఎంఓ లక్ష్మీనారాయణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సంగీత, లవకుమార్ రెడ్డి, కన్న పరశురాములు, వై. సంజీవరెడ్డి, జి. ప్రమోద్ కుమార్ గుప్త, పాస్టర్స్ సామ్యూల్ కరుణాకర్, రవి కుమార్, సీహెచ్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌కె హమీద్ వీఆర్ నుంచి బచ్చన్నపేట, కె.సతీష్ బచ్చన్నపేట నుంచి ఐటీ కోర్, బి.చందర్ ఎస్‌బీ వరంగల్ నుంచి వర్ధన్నపేట, ఎ.ప్రవీణ్‌కుమార్ వర్ధన్నపేటనుంచి కేయూసీకి బదిలీ అయ్యారు.

డీజేలపై నిషేధం

వరంగల్ క్రైం: పోలీస్ కమిషనరేట్ పరిధిలో డీజేలపై నిషేధం విధిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. డీజేల నుంచి వెలువడే పెద్ద పెద్ద శబ్దాల వల్ల ప్రజల, వృద్ధుల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆయన తెలిపారు. ఇకపై మతపరమైన ఊరేగింపుల్లో డీజే సౌండ్ల వినియోగించడం, బాణా సంచా కాల్చడం వంటివి చేస్తే నిబంధనలను అతిక్రమించిన వారికి రూ.1 లక్ష జరిమానా, 5 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి



నర్మెట: గ్రామాల్లోని తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూప అన్నారు. మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన వాటర్‌మెన్‌ల శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. బోరు మోటార్లు, చేతిపంపుల మరమ్మతు, నీటి సరఫరా పైపుల లీకేజీలు, నీటి నాణ్యతపై రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వారిచే శిక్షణ ఇప్పించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఎంపీడీఓ బి. అరవింద్ చౌదరి, ఏఈ ప్రజ్వల్ కుమార్, వాటర్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.



బస్సుకోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

పండుగ వేళ రద్దీగా ఆర్టీసీ

11వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు | నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

జనగామ: బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో ప్రభుత్వ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. నేటి నుంచి ఈ నెల 14వ తేదీ వరకు సెలవులు కాగా.. 15న రీఓపెన్ చేయనున్నారు. పండుగల సందడితో స్వగ్రామాలకు తిరిగి వచ్చే కుంటుంబాలతో మంగళవారం ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. హైదరాబాద్, ముంబాయి, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వస్తున్నారు. ప్రస్తుతం జనగామ డిపోకు చెందిన 109 బస్సులు 41 రూట్లతో ప్రయాణిస్తుండగా.. పండగ సమయంలో 120 బస్సులను పెంచారు. హనుమకొండ, ఉప్పల్, సిద్దిపేట, సూర్యాపేట రూట్లలో ఎక్కువ డిమాండ్ ఉండగా, అందుకు తగ్గట్టుగా ఆయా రూట్లలో బస్సు సర్వీసులను నడిపించనున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 11 వరకు రోజువారీగా ప్రత్యేక (అదనపు) బస్సు సర్వీసులను నడిపించేలా డీఎం ఎస్.స్వాతి ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ





పూల పండుగకు వేళాయె..



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

నేడు ఎంగిలిపూల బతుకమ్మ

- తొమ్మిది రోజుల పాటు సంబురాలు
- తెలంగాణ సంస్కృతికి ప్రతీక

జనగామ: బతుకునిచ్చే తల్లి బతుకమ్మ. త్యాగమై అనురాగాన్ని పంచుతూ.. బంధానుబంధాలను కలుపుతూ.. అమ్మ ప్రేమను అందించే గౌరమ్మతల్లి. ప్రకృతి పూజితమై ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ, తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలను కలబోసే ఆడపడుచుల పండుగ బతుకమ్మ. ప్రపంచంలో మరెక్కడా కనిపించని పూల పండుగకు ఎంతో విశిష్టత కలిగి ఉంది.

నేడు ఎంగిలిపూల బతుకమ్మ

ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ పండగ సంబురాలు నేటి (బుధవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. నిత్యం విభిన్న రకాల పూలను సేకరించి కళాత్మకంగా బతుకమ్మను పేరుస్తారు.

బొడ్డెమ్మకు వీడ్కోలు

'బొడ్డెమ్మ, బతుకమ్మ' పండుగలు తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకతను చాటుతాయి. అశ్వయుద్ధపాడ్యం నుంచి మహర్నవమి వరకు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. అంతకు ముందు బొడ్డెమ్మ పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మంగళవారం పోయిరా బొడ్డెమ్మ పోయిరావమ్మా.. అంటూ పాటలు పాడుతూ బొడ్డెమ్మకు వీడ్కోలు పలికారు.

జిల్లా కేంద్రంలో పండుగ సందడి

జిల్లా కేంద్రంలో తంగేడు, గునుగు, గడ్డి, చామంతి, బంతి పూల అమ్మకాలు జోరందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పూలను తీసుకువచ్చిన కార్మికులు వాటితో ఉపాధి పొందుతున్నారు.

బతుకమ్మకుంటలో ఏర్పాట్లు

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే బతుకమ్మ వేడుకలను జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించుకునేందుకు ఆయా శాఖల అధికారులతో పాటు గ్రామ పంచాయతీల్లో ఏర్పాట్లను చేశారు. జనగామ పట్టణంలోని బతుకమ్మకుంటలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. రంగప్ప చెరువు ఆవరణతో పాటు వీవర్స్‌కాలనీ, హెడ్‌పోస్టాఫీసు, గ్రెయిన్ మార్కెట్, అంబేద్కర్‌నగర్, తదితర కాలనీల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహించుకోనున్నారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షణలో ఏసీపీ పార్థసారథి ఆధ్వర్యంలో సీఐ దామోదర్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

ఒక్కరిపైనే ఒత్తిడి



- 'డీసీఎస్'కు అదనపు సిబ్బందిని నియమించాలి
- అసిస్టెంట్లు లేకుంటే ఎలా?
- జిల్లాలో 62 క్లస్టర్లు, 3.20 లక్షల ఎకరాలు
- డిజిటల్ సర్వే చేయలేము..
- రెండో రోజుకు చేరిన ఏఈఓల సమ్మె



డీఏఓకు సమ్మె నోటీసు ఇస్తున్న ఏఈఓలు

జనగామ: వ్యవసాయ రంగంలో రోజురోజుకు సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'డిజిటల్ క్రాప్ సర్వే' (డీసీఎస్)కు శ్రీకారం చుట్టింది. గతంలో మాన్యువల్‌లో వానాకాలం, యాసంగి సీజన్‌లో పంటల నమోదు చేస్తూ ఆన్‌లైన్ చేసేవారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందిస్తున్న సబ్సిడీ సొమ్ముకు పారదర్శకత ఉండాలనే ఉద్దేశంతో డిజిటల్ సర్వే చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒడిసా తదితర రాష్ట్రాల్లో క్రాప్ బుకింగ్ సర్వేకు విస్తరణాధికారికి అనుబంధంగా సహాయకులను నియమించారు. తెలంగాణలో ప్రస్తుతం ఏఈఓలపై రకరకాల పథకాల నిర్వహణ బాధ్యతలు ఉండడం, అసిస్టెంట్లు లేక పోవడంతో ఈ సర్వే భారంగా మారనుంది. ఒక్కరితో డిజిటల్ సర్వే కష్టమని భావించిన ఏఈఓలు... తోడుగా వెయ్యి ఎకరాలకు ఒక్క వీఏఓ (విలేజ్ అసిస్టెంట్)లను నియమించాలని కోరుతూ డీఏఓ రామారావు నాయక్‌కు సోమవారం సమ్మె నోటీసు అందించారు.

జిల్లాలో 62 క్లస్టర్లు, 3.20 లక్షల ఎకరాలు

జిల్లాలోని 283 గ్రామ పంచాయతీల పరిధిలో 62 మంది ఏఈఓలు, 62 క్లస్టర్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 3.20 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రస్తుతం ఏఈఓలు రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, పంటల కొనుగోలు కేంద్రాలు, పంట కోత ప్రయోగాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టం అంచనా, అవగాహన సదస్సులు ఇలా 49 రకాల పనులను చేస్తూనే.... మరో వైపు పంట నమోదును పకడ్బందీగా చేపడుతున్నా రు. పక్క రాష్ట్రాల్లో తెలంగాణ మాదిరిగా పథకాలు లేకపోవడం... అక్కడ వీఏఓలు ఉండడంతో డిజిటల్ సర్వేకు ఎలాంటి ఆటంకాలు లేవు. మన రాష్ట్రంలో కూడా వెయ్యి ఎకరాలకు ఒక వీఏఓను నియామకం చేస్తే బాగుంటుందని అభిప్రాయ పడుతున్నారు.

సాధ్యమయ్యే పనేనా!

కొద్ది రోజుల క్రితం డిజిటల్ సర్వే ద్వారా క్రాప్ బుకింగ్ కోసం వ్యవసాయ శాఖ జనగామ మండలంలో ట్రయల్ రన్ చేపట్టింది. మండలంలో 7 గురు ఏఈఓలు ఉండగా.. పక్క మండలాలకు చెందిన మరో 11 మందికి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ క్రాప్ బుకింగ్ చేపట్టింది. 18 మంది కలిసి పొద్దంతా పని చేస్తే, వందశాతం నమోదుకు నాలుగు నెలల సమయం పట్టింది. ప్రస్తుతం ఒక్కో ఏఈఓ పరిధిలో 6, 10, 15వేల ఎకరాల పరిధి ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధనలతో ఒక్క ఏఈఓతో డిజిటల్ క్రాఫ్ బుకింగ్ సాధ్యమయ్యే పనేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పొలం వద్దకు వెళ్లిన సమయంలో రైతు అందుబాటులో లేకుంటే మరోసారి వెళ్లాల్సి ఉంటుంది. ఫొటో క్యాప్చరింగ్, లొకేష్ షేర్ చేయడం ఇలా సాంకేతికతను జోడిస్తూ ప్రస్తుతం ఉన్న పథకాలను అమలు చేస్తూనే... క్రాఫ్ బుకింగ్ చేయాలంటే ఆరు నెలల సమయం పడుతుందని అంటున్నారు. డిజిటల్ క్రాప్ సర్వేకు గ్రామ స్థాయిలో తాత్కాలిక సిబ్బందిని నియమిస్తే చిత్తశుద్ధితో పని చేస్తామని ఏఈఓలు వాపోతున్నారు.

అదనపు సిబ్బందిని నియమించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఈఓలు

రఘునాథపల్లి: ఏఈఓల సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని 12 మండలాలకు చెందిన ఏఈఓలు మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈఓల సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్యాణి మాట్లాడుతూ డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) నిర్వహించడానికి గ్రామస్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలని, ఖాళీగా ఉన్న స్థానాల్లో ఏఈఓలను భర్తీ చేయాలని కోరారు. తమ వినతికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ తెలిపినట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి నరసింహులు, ట్రెజరర్ ప్రతిభ, ఏఈఓలు పాల్గొన్నారు.

వీఏఓలను నియమించాలి



డిజిటల్ క్రాప్ సర్వేను విజయవంతంగా అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాల మాదిరిగా వెయ్యి ఎకరాలకు ఒక తాత్కాలిక వీఏఓను ఏర్పాటు చేయాలి ఇలా చేస్తే సర్వే పారదర్శకంగా, అనుకున్న సమయంలో పూర్తి చేయగలుగుతాం.- **గుగులోతు యాకూబ్ నాయక్, ఏఈఓ, చిల్పూరు**

కమిటీ ఏర్పాటు చేయాలి



డిజిటల్ సర్వే సమస్యను పరిష్కరించేందుకు అనుభవజ్ఞులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలి. అందులో ఏఈఓలను భాగస్వాములను చేసి, సభ్యులుగా నియమించాలి. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సర్వేపై నిర్ణయం తీసుకోవాలి. రైతులకు ఇబ్బంది కలుగకుండా, ఉద్యోగులపై భారం పడకుండా ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.

- మన్యపు దీపక్, ఏఈఓ, ఈరవెన్ను, క్లస్టర్

ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా టి.వినయ్‌కృష్ణారెడ్డి



సాక్షిప్రతినిధి, వరంగల్: జిల్లాల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఉమ్మడి వరంగల్‌కు టి.వినయ్ కృష్ణారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆరు జిల్లాల కలెక్టర్‌లు, వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన సంబంధిత హెచ్‌ఓడీలు, ఆయా జిల్లాల యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ కార్యక్రమాల్ని, పథకాల అమలును పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఉత్తర్వులు వెలువడిన నుంచి బాధ్యతలు స్వీకరించి జిల్లాల్లో పర్యటించాలని కూడా సూచించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ హోదాల్లో హెల్త్, మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగాలు చూస్తున్నారు. వినయ్ కృష్ణారెడ్డి గతంలో ఉమ్మడి వరంగల్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. జనగామ ఆర్డీఓగా, వరంగల్ జిల్లా డ్వామా పీడీగా, జిల్లాల విభజన తర్వాత జనగామ కలెక్టర్‌గా కూడా వ్యవహరించారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- వీసీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

జనగామ రూరల్: సంక్షేమ పథకాల అమలులో అధికార యంత్రాంగం అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పురపాలక శాఖ కార్యదర్శి దాన కిషోర్, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్. చౌహన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, డబుల్ బెడ్ రూం, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. 3వ తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో ఒక మున్సిపల్, గ్రామాల్లోని కుటుంబాల వివరాలను ఇంటింటికీ తిరిగి సేకరించాలని సూచించారు. సన్న, దొడ్డు ధాన్యం వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. వీసీలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్‌లు రోహిత్ సింగ్, పింకేష్ కుమార్, ఆర్డీఓ వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.

రుణాలు అందజేయాలి

ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్‌తో కలిసి పంట రుణాలు మంజూరు, రెన్యూవల్ తదితర అంశాలపై బ్యాంకర్లతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించడానికి ఈనెల 6న ఎస్‌ఎల్‌ఎం బృందం పర్యటించనున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. దేవరుప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, కొడకండ్ల, మండలాల్లో 5 గ్రామాల చొప్పున మొత్తం 20 గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ వసంత, శ్రీనివాస్, డీపీఓ స్వరూప, జెడ్పీ సీఈఓ సరిత పాల్గొన్నారు.

వృద్ధులను ఆప్యాయతతో చూసుకోవాలి

వయోవృద్ధులను ఆప్యాయతతో చూసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం జిల్లాలోని శామీర్‌పేటలోని రుద్రమదేవి వద్ధాశ్రమంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధులు దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులకు నచ్చినట్లు జీవించే హక్కు ఉందని, పిల్లు తల్లిదండ్రులకు ప్రేమ, ఆప్యాయతలను పంచాలన్నారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ యాక్ట్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. డీసీపీ మాట్లాడుతూ వృద్ధులకు ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. వృద్ధాశ్రమంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జయంతి, జెడ్పీ సీఈఓ సరిత, డీఎంహెచ్ఓ రవీందర్ గౌడ్, డీఆర్డీఏ వసంత, జిల్లా వయవృద్ధుల కమిటీ సభ్యులు కన్నా పరశురాములు, కేథరిన్ హేమలత, మర్రి జనార్దన్ రెడ్డి, తెలంగాణ ఆల్ రిటైర్డ్ పెన్షన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజయ్య, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..



ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- ఉమ్మడి వరంగల్ నేతలతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులకు సూచించారు. ఇటు జిల్లాలో, అటు రాష్ట్రంలో ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో కలిసి ఉమ్మడి జిల్లా శాసనసభ్యులతో హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం మంత్రి పొంగులేటి సమావేశమయ్యారు. రాజకీయ అంశాలతోపాటు జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో ఎంపీలు బలరాం నాయక్, కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉత్తమ ఇంజనీర్లకు అవార్డులు



అవార్డులు అందుకున్న అధికారులు, ఉద్యోగులు

జనగామ: విద్యుత్‌శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇంజనీర్లకు ప్రాజెక్టు డైరెక్టర్ సదర్‌లాల్ చేతుల మీదుగా సీఎండీ పంపించిన ఉత్తమ అవార్డులను అందించారు. మంగళవారంఎన్‌పీడీసీఎల్ జనగామ డివిజన్ కార్యాలయంలో ఎస్‌ఈ వేణు మాధవ్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉత్తమ అధికారులు, ఉద్యోగులు నారాయణరెడ్డి, వేణు గోపాల్, రాజ్‌కుమార్‌లతో పాటు మనోహర్ రెడ్డి, శ్రీమధు, నరసింహులు, నరసింహారెడ్డి, రవీందర్, బాలగంగాధర్‌తిలక్, రణధీర్, కనకయ్యలకు అవార్డులతో పాటు ప్రశంస పత్రాలను అందించారు.

దసరాకు ప్రత్యేక బస్సు సర్వీసులు

- ఆర్టీసీ వరంగల్ రీజియన్ నుంచి ఉప్పల్ మధ్య రాకపోకలు
- ఉచిత బస్సు ప్రయాణంతో పెరగనున్న ప్రయాణికులు



హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది. వివిధ ప్రాంతాల్లో జీవనోపాధి పొందుతున్న వారంతా పండుగలకు స్వగ్రామం, సొంతిళ్లకు వచ్చివెళ్తారు. ఈక్రమంలో బస్సుల్లో రద్దీ పెరగనుంది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల నుంచి హైదరాబాద్ ఉప్పల్ మధ్య ఆర్టీసీ ఈబస్సులను తిప్పుతోంది. ఈనెల 1 నుంచి 15 వరకు రోజూ తిరిగే బస్సులతో పాటు మొత్తం 850 ప్రత్యేక బస్సులు నడపాలని ప్రణాళిక రూపొందించింది. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో అదనపు బస్సులు నడిపేందుకు సన్నాహాలు చేశారు. ఈఏడాది మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో ఈసారి మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు అంచనాకు వచ్చారు.

అదనపు బస్సులు సైతం..

ఈక్రమంలో రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా వరంగల్ రీజియన్లలోని వివిధ బస్‌స్టేషన్ల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని టీజీఎస్ అధికారులు నిర్ణయించారు. ప్రధానంగా హనుమకొండ–హైదరాబాద్ ఉప్పల్, పరకాల, భూపాలపల్లి, కాళేశ్వరం, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, జనగామ–ఉప్పల్ మధ్య ప్రత్యేక బస్సులు నడిపేలా కార్యాచరణ రూపొందించారు.

డిపోవారీగా బస్సులిలా..

డిపో	ప్రత్యేక బస్సులు
హనుమకొండ	125
జనగామ	120
వరంగల్–1	125
వరంగల్–2	125
మహబూబాబాద్	47
నర్సంపేట	119
పరకాల	93
తొర్రూరు	48
భూపాలపల్లి	48

రోజువారీ ప్రణాళిక ఇలా..

- ఈనెల 1 నుంచి 12 వరకు ఏరోజు ఏ రూట్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందనే ఆలోచన మేరకు రోజువారీ ప్రణాళికను అధికారులు తయారు చేశారు.
- ఈమేరకు ఆయా రోజుల్లో అదనపు బస్సులను అందుబాటులో ఉంచుకుని ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తారు.
- ఈనెల 1, 2 తేదీల్లో హనుమకొండ–హైదరాబాద్ మధ్య రోజుకు 100 అదనపు బస్సులు, ఈనెల 3, 4, 5, 7 తేదీల్లో రోజుకు 50 అదనపు బస్సులు నడపనున్నారు.
- 6న 30, 8న 100, 9, 10, 11, 13, 14వ తేదీల్లో 110 అదనపు బస్సులు
- 15న 100 అదనపు బస్సులు నడుపనున్నారు.
- 12న 50 అదనపు బస్సులు నడిపేలా ప్రణాళిక రూపొందించారు.
- పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో మంగళవారం సాయంత్రం నుంచి ఆర్టీసీ బస్సులకు ప్రయాణికుల సంఖ్య పెరిగింది.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు



ప్రయాణికుల సౌకర్యార్థం దసరాకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. రద్దీని బట్టి ఆయా రూట్లలో అదనంగా బస్సులు నడుపుతాం. ప్రధానంగా హనుమకొండ–హైదరాబాద్ ఉప్పల్ మధ్య ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటాం. **- డి.విజయ భాను, వరంగల్ రీజినల్ మేనేజర్**

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో

నేడు ఎంగిలి పూల బతుకమ్మ

- తొమ్మిది రోజుల పాటు కొనసాగనున్న పండుగ.. సద్దులతో పూర్తి
- ఆట స్థలాలు, చెరువుల వద్ద ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఆడపడుచుల రాకతో కళకళలాడుతున్న గ్రామాలు

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ సంస్కృతి విభిన్నమైనది. భాష.. యాస, ఆచార వ్యవహారాలు ఇతరులకు పూర్తిగా భిన్నం. చెట్టు.. పుట్ట.. రాయి, పూలను దైవాలుగా భావించి కొలిచే సంస్కృతి ఇక్కడే కనిపిస్తుంది. ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. అలాగే, తమతోపాటు ఇతరులూ చల్లంగా ఉండాలని భావించే మంచి మనస్తత్వం తెలంగాణ ప్రజల జీవన విధానంలోని ఓ ప్రత్యేకత. బతుకు.. బతికించు.. అన్నదే ఇక్కడి జీవనవేదం. ఈ క్రమంలో సృష్టిలో భూమ్మీద మట్టినుంచి వచ్చిన ఎన్నెన్నో పూలు.. అలా ఎన్ని పూలు పూసినా అన్నీ పరమాత్ముడి కోసమే అన్నట్లు ఆడపడుచులు బతుకమ్మలను పేర్చుకుని ఆ జగన్మాత కోసం, పరమేశ్వరుడి ప్రీతి కోసం బయలుదేరడమే బతుకమ్మ పండుగ విశిష్టత. బుధవారం నుంచి ఎంగిలి పూవు బతుకమ్మతో పండుగ ప్రారంభం కానుంది. ఈనేపథ్యంలో బతుకమ్మ పండుగ విశిష్టత, ప్రత్యేకతపై 'సాక్షి' కథనం..

ఎంగిలి పూల బతుకమ్మ..

ఆశ్వయుజ శుద్ధపాడ్యమికి ముందు వచ్చే అమావాస్యను పెత్రమాస అంటారు. బతుకమ్మ పండుగ పెత్రమాస నాడు ప్రారంభమై మహర్నవమి రోజున సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. మొదటి రోజున ఎంగిలి పూల బతుకమ్మగా, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా జరుపుకుంటారు. బతుకమ్మను పేర్చుకోవడానికి ముందు రోజే గ్రామం వెలుపల చేన్లు, చెలకలలో పెరిగిన తంగేడు, గునుగు, సీతజడ, తదితర పూలను సేకరించి ఇంటికి తెచ్చుకుంటారు. తెచ్చుకున్న వారి ఇంటిలో ఈ పూలు ఒకరోజు నిద్ర చేస్తాయి. ఆ విధంగా నిద్ర చేసిన పూలతో బతుకమ్మ పేర్చడం వల్ల ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారు. అంతే కాకుండా ముందు రోజు మొగ్గలుగానున్న పూలు తెచ్చుకుని బతుకమ్మ పేర్చుతున్నప్పుడు నోటితో పూలను ఊది పేరుస్తారు. ఆవిధంగా పూలను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు.

బతుకమ్మ పేర్చడంలో శ్రీచక్రం..

శక్తిఆరాధనలో సర్వోత్కృష్టమైనది శ్రీచక్రోపాసన శక్తివంతమైన త్రిపురసుందరికి ప్రతిరూపం. బతుకమ్మను శ్రీచక్రంలోని కుండలిని యోగవిశేషశక్తిగా భావిస్తారు. శ్రీచక్రంలోని మేరు ప్రస్తారంలో క్రింద చతురస్రం, అష్టభుజి, త్రిభుజంలా వలయం ఉంటాయి ఇలాగే బతుకమ్మ ఉంటుంది. బతుకమ్మ పేర్చడంలో కూడా మూలాధార చక్రంలోని శక్తిని సహస్రార కమలంలోని సదాశివుడితో సమాగమింపచేయడం కన్పిస్తుంది. కుండలిని యోగవిశేషమైన శక్తిని గౌరమ్మగా నిలిపి పూజిస్తారు. మొదటి వరసలో ఉండే తంగేడు పూలూ పరమేశ్వరుడికి ప్రతీకకాగా, పైభాగంలోని గుమ్మడిపూలు గౌరిదేవికి ప్రతీక అవుతుంది. ఆ తరువాత మధ్యలో ఉన్న ఒక్కొక్కజాతి పూలు కుండలిని యోగంలోని మూలాధార స్వాధిష్టానాలు అయిన రుద్రఖండం, విష్ణుఖండం, బ్రహ్మఖండంలోని పార్వతి, లక్ష్మి, సరస్వతి దేవతల ప్రతీకలు.



బతుకమ్మ

పితృఅమావాస్య..

పెత్రమాసనే పితృ అమావాస్య అని, మహాలయ అమావాస్య అని, హస్తానక్షత్రయుక్త గజచ్ఛాయ అమావాస్య అని, పితాళ్ల అమావాస్య అని పిలుస్తారు. ఈ రోజు పైలోకాలలో ఉన్న పితృదేవతలు భూలోకంలో తమవారికోసం వస్తారని భావిస్తారు. వారి కోసం, వారి సంతృప్తికోసం సహపంక్తి భోజనాలు నిర్వహించి కులమత భేదం లేకుండా కలిసి భుజించాలని అంటారు. అలా చేయడం అందరికీ వీలుకాదు. ఈ నేపథ్యంలో పితృదేవతల పేరుమీద బియ్యం ఇచ్చే సంప్రదాయం ప్రారంభమైంది.



ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

బతుకమ్మను సంతోషంగా జరుపుకోవాలి



తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ పండుగను మహిళలు సంతోషంగా జరుపుకోవాలి. దసరా వరకు పదిరోజుల పాటు జరిగే పండుగ సందర్భంగా మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల విషయంలో జాగ్రత్త అవసరం. బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో'షీ' టీం, చెరువుల వద్ద గజఈతగాళ్ల బృందాలు ఏర్పాటు చేశాం..

- సత్యశారద, కలెక్టర్, వరంగల్

తెలంగాణ సంస్కృతి మూలాలు తెలుసుకునే అవకాశం



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలు బతుకమ్మ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారు. ఈ పండుగతో తెలంగాణ సంస్కృతి మూలాలు తెలుసుకునే గొప్ప అవకాశం ఉంటుంది. ఇలాంటి సాంస్కృతిక పునర్జీవం నేటి సమాజానికి ఎంతో అవసరం.

- మైదం రూపారాణి, అధ్యాపకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రంగశాయిపేట

ఇళ్లు కళకళలాడుతాయి..



తెలంగాణ ప్రాంతంలో ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ప్రత్యేక పండుగ బతుకమ్మ. పండుగ ప్రారంభమవుతుందంటే ఆడబిడ్డలు పుట్టింటికి వస్తారు. దీంతో ఇళ్లు కళకళలాడుతాయి. ఒకరి సద్దులు మరొకరు తీసుకోవడం సంతోషం కలిగించే అంశం.

-బొల్లోజు భాగ్యలక్ష్మి, గృహిణి, కుమార్‌పల్లి, హనుమకొండ

హోరాహోరీ పోరు

- కొనసాగుతున్న అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు



కరీంనగర్ జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ కేంద్రంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్– 19 అంతర్ జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పూల్ 'ఏ' పూర్తి చేసుకుని, పూల్ 'బీ' విభాగంలో ప్రారంభమైన పోటీల్లో మంగళవారం కరీంనగర్, నిజామాబాద్ జట్లు ప్రత్యర్థులను శుభారంభం చేశాయి. కోమటిపల్లి మైదానంలో ఆదిలాబాద్, నిజామాబాద్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 28.3 ఓవర్లను ఎదుర్కొని 93 పరుగుల ఆల్‌ఔట్ అయింది. నిజామాబాద్ బౌలర్లు కుద్దూస్ 4వికెట్లు, నవీన్ 3వికెట్లు తీశారు. అనంతరం బరిలోకి దిగిన నిజామాబాద్ జట్టు 27.5 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 94 పరుగులు సాధించి విజయం సాధించింది.మొగిలిచర్ల గ్రౌండ్‌లో ఖమ్మం, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 25.4 ఓవర్లను ఎదుర్కొని 99 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. ఖమ్మం బ్యాట్స్‌మెన్ నేహిత్ 34 పరుగులతో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. కరీంనగర్ బౌలర్ అర్శద్, విష్ణుష్ చెరో 4 వికెట్లు తీసి ప్రత్యర్థులకు గుబులు పుట్టించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు కేవలం 17.1ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 102పరుగులు చేసి విజయం సాధించింది. తక్షీల్ 50 పరుగులు, రుత్విక్ 32 పరుగులు చేసి జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించారు. కాగా, నేడు మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్ ఖమ్మం, కోమటిపల్లి గ్రౌండ్‌లో కరీంనగర్, నిజామాబాద్ జట్లు తలపడనున్నట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

'హైడ్రా'ను వికాసానికి వినియోగించాలి

- పేదల జోలికి రావొద్దు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

న్యూశాయంపేట: హైడ్రా విధ్వంసానికా.. వికాసానికా.. అనే విషయంపై ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా అంటే పేద మధ్యతరగతి ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో విల్లాలు, మాల్స్ తదితర వాటిపై పూర్తిస్థాయిలో లెక్కకట్టి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ నగర పరిధిలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు 58, 59 జీఓ ద్వారా పట్టాలు ఇవ్వాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ తాత్కాలిక సంతృప్తి కోసం పాకులాడుతున్నాయని, ఆపార్టీల నాయకులను చూస్తుంటే 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌రెడ్డిపై ఈడీ దాడులు కొందరినే టార్గెట్ చేసేలా ఉన్నాయన్నారు. బీజేపీలో తప్పు చేసిన వారు లేరా..? అని ప్రశించారు. బీజేపీ గ్రాఫ్ క్రమేపీ తగ్గుతోందని, బీఆర్ఎస్‌ను ప్రజలు లెక్కలోకి తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి సమయం ఇస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అమలు కాకపోతే కమ్యూనిస్టు పార్టీలు పేదల పక్షాన పోరాడుతాయన్నారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు, రాష్ట్ర నాయకులు ఎస్.జ్యోతి, జిల్లా నాయకులు భిక్షపతి, కరుణాకర్, ఎల్లేశ్, భిక్షపతి, సదాలక్ష్మి పాల్గొన్నారు.

3 నుంచి 'ఓపెన్' పరీక్షలు

- పదిలో 601, ఇంటర్‌లో 663 మంది విద్యార్థులు

విద్యారణ్యపురి : తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 3 నుంచి 9వతేదీ వరకు జరగనున్నాయి. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ప్రవేశం పొందిన స్టడీసెంటర్లు లేదా సంబంధిత వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ ఓపెన్ స్కూల్ ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని డీఈఓ వాసంతి, ఏసీజీ బి. భువనేశ్వరి, ఉమ్మడి వరంగల్‌జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు తెలిపారు. పది, ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లా కేంద్రాల్లో పదికి ఒకటి, ఇంటర్‌కు మరొకటి చొప్పున 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో పదిలో 601మంది, ఇంటర్‌లో 663మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ ఉంటుంది.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో ఈ నెల 3వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్స్, సబ్‌జూనియర్స్ బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా నిర్వహణ కార్యదర్శి పోతరాజు రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ విభాగంలో జనవరి1, 2008 నుంచి డిసెంబర్ 31, 2009 మధ్యలో జన్మించిన వారు, సబ్ జూనియర్స్ విభాగంలో జనవరి1, 2010 నుంచి 2011 డిసెంబర్ 31 మధ్యలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత గల క్రీడాకారులు గురువారం ఉదయం 7గంటలకు బాక్సింగ్ హాల్ వద్దకు రావాలన్నారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్, జనన ధ్రువీకరణ, స్కూల్ బోనో ఫైడ్ సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 5,6వ తేదీల్లో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9959711609 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కాజీపేట మీదుగా 'భారత్ గౌరవ్ టూరిజం'

- పర్యాటకుల కోసం రైలును నడపనున్న ఐఆర్‌సీటీసీ
- దివ్యదర్శన్ యాత్ర, జ్యోతిర్లింగ ప్రదేశాల సందర్శన

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా నవంబర్ 6వ తేదీన ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం భారత్ గౌరవ్ టూరిజం ట్రైన్‌ను నడిపించనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగర్ తెలిపారు. ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ సికింద్రాబాద్ కిశోర్ పర్యవేక్షణలో కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో మంగళవారం ఐఆర్‌సీటీసీ ఏజెంట్లతో ప్రత్యేక రైలుపై అవగాహన, బుకింగ్ విధానంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ సెంగర్ మాట్లాడుతూ ఐఆర్‌సీటీసీ టూరిజం భారత్ గౌరవ్ టూరి జం ట్రైన్‌లో భోజనం, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, టీ, కాఫీ, వాటర్ కల్పిస్తూ రవాణా సౌకర్యం, హోటల్ వసతి, ఇన్సూరెన్స్, సీసీ కెమెరాలతో కూడిన సెక్యూరిటీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ట్రైన్ సికింద్రాబాద్ నుంచి బయలుదేరి కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణిస్తుందన్నారు. నవంబర్ 6 నుంచి 14వ తేదీవరకు 9 రోజుల పాటు సాగే ప్రయాణంలో రామేశ్వరం, అరుణాచలం, మధురై, కన్యాకుమారి, తిరుచ్చి, తంజావూరు పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తుందన్నారు. ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్ రూ.14,250, థర్డ్ ఏసీ రూ.21,900, సెకండ్ ఏసీ రూ.28,450 టికెట్ ధర ఉందన్నారు. మొత్తం 716 మందితో రైలుయాత్ర ఉంటుంది. వివరాలకు 9281030749, 9281030750, 8287932228 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్లు కొక్కుల ప్రశాంత్, ఎం.శ్రీకాంత్, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



టూరిజం ట్రైన్ ప్యాకేజీ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగర్

డీఎస్సీ మెరిట్ లిస్టు వెల్లడిలో జాప్యం

- మొదట జాబితా వెల్లడించి టెక్నికల్ మిస్టేక్స్ అని తొలగింపు
- రాత్రి వరకు వెబ్‌సైట్‌లో కనిపించని వైనం
- డీఈఓల నిరీక్షణ

విద్యారణ్యపురి: డీఎస్సీ ఫలితాలను సోమవారం వెల్లడించిన అధికారులు.. మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం మంగళవారం వరకు ఒక పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల ఎంపిక జాబితాను ఆయా జిల్లాల డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచుతారని ప్రకటించిన విషయం తెలిసిందే. సాయంత్రం జాబితా పెట్టినట్లే పెట్టి తొలగించారు. రాత్రి వరకు జాబితా ప్రకటించలేదు. ఆశావాహ అభ్యర్థులు కొందరు డీఈఓ కార్యాలయాలనికి వచ్చి సంబంధిత ఉద్యోగులను అడిగి తెలుసుకుని నిరాశతో వెనుదిరిగారు. జాబితా కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1519 టీచర్ పోస్టులకు ముగ్గురు చొప్పున అంటే 4,557మంది అభ్యర్థులు నీరిక్షిస్తున్నారు.

కరెక్షన్ అంటూ జాబితా తొలగింపు..

మంగళవారం సాయంత్రం 6–30గంటల ప్రాంతంలో మెరిట్ లిస్టు ఒక్కో పోస్టుకు ముగ్గురి అభ్యర్థుల ఎంపిక జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పెట్టారు. కొంతసేపటికే అందులో కరెక్షన్స్ చేయాల్సి ఉందని, సాంకేతిక పరమైన సమస్యలున్నాయని తొలగించారు. రెండు రోజులనుంచి ఆతృతగా ఎదురు చూసిన అభ్యర్థులు ఒక్కసారిగా నీరసించిపోయారు. ఆ జాబితాల కోసం ఆయా జిల్లాల డీఈఓలు కార్యాలయాల్లోనే నిరీక్షిస్తున్నారు. మెరిట్ లిస్టు రాత్రి వరకు పెడితే తప్పనిసరిగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ బుధవారం నుంచి 5వ తేదీ వరకు ఉంటుందని హనుమకొండ డీఈఓ వాసంతి వెల్లడించారు.

చర్చి అభివృద్ధిలో పాలుపంచుకోవడం నా భాగ్యం





సీబీసీని ప్రారంభిస్తున్న రాజమండ్రి హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్ జాన్ వెస్లీ, కరుణాపురం క్రీస్తుజ్యోతి ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ ఎస్. పాల్సన్‌రాజ్, మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- కనులపండువగా సీబీసీ ప్రారంభం

కాశిబుగ్గ: వరంగల్ క్రిస్టియన్‌కాలనీలోని నూతన సీబీసీ (సెంటినరీ బాప్టిస్టు చర్చి) అభివృద్ధిలో పాలుపంచుకోవడం తన భాగ్యమని, అది ఏసుప్రభువు కృపతోనే జరిగిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం తన భర్త కొండా మురళీధర్‌రావుతో కలిసి సీబీసీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంచి చేయాలనుకుంటే దేవుడి ఆశీర్వాదం మనకు ఉంటుందన్నారు. తాను తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చర్చి అభివృద్ధికి రూ. కోటి నిధులు తీసుకొచ్చానని తెలిపారు. మళ్లీ ప్రభువు దయతో ఇప్పుడు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్నానని, రానున్న రోజుల్లో చర్చి అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. కాగా, నూతన చర్చి ప్రారంభం కనుల పండువగా జరిగింది. దేశ విదేశాలలో ఉన్న క్రైస్తవులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో క్రిస్టియన్ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. అంతకుముందు రాజమండ్రి హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్ జాన్ వెస్లీ, కరుణాపురం క్రీస్తు జ్యోతి ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ ఎస్. పాల్సన్‌రాజ్.. చర్చి అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్ సాల్మన్, కొల్లూరి రాజ్‌కుమార్‌తో కలిసి సీబీసీని ప్రారంభించారు.

కేయూలో విజిలెన్స్ విచారణ

- పీహెచ్‌డీ అడ్మిషన్ల నిబంధనలపై ఆరా..
- రికార్డులు, జిరాక్స్ కాపీలు తీసుకున్న అధికారులు
- అందుబాటులో లేని రిజిస్ట్రార్



కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో కొనసాగుతున్న విజిలెన్స్ అధికారులు విచారణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో గత వీసీ హయాంలో వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై కొన్నినెలల క్రితమే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం సిబ్బందితో కలిసి యూనివర్సిటీలో విచారణ చేపట్టారు. ఉదయం 11.30గంటలకు విజిలెన్స్ అధికారులు యూనివర్సిటీకి రాగా అప్పటికే రిజిస్ట్రార్ మల్లారెడ్డి హైదరాబాద్‌కు వెళ్లడంతో ఆయనను ఫోన్‌లో సంప్రదించారు. దీంతో ఇప్పటికే అందిన ఫిర్యాదులపై విజిలెన్స్ అధికారులు.. కేయూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారుల ప్రశ్నలకు కేయూ అధికారులు సమాధానం ఇవ్వడంతోపాటు వారు కోరిన రికార్డులు అందజేశారు.

సీడ్‌మనీ గ్రాంట్ రీసెర్చ్ ప్రాజెక్టుపై..

సీడ్‌మనీ గ్రాంట్ మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టుకు సంబంధించి విజిలెన్స్ అధికారులు ఐక్యూఏసీ డైరెక్టర్, సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. గత వీసీ హయాంలో న్యాక్ గ్రేడ్‌కోసం ఎస్ఎస్ఆర్‌లో పెట్టిన సీడ్‌మనీ గ్రాంట్ మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టు కింద ప్రొఫెసర్లు అప్లికేషన్స్ చేసుకునేందుకు 2022 నవంబర్ 21న అప్పటి రిజిస్ట్రార్ నోటిఫికేషన్ ఇచ్చారు. మళ్లీ అదే నెలలో 24వ తేదీనే వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు ప్రొఫెసర్లుకు సీడ్‌మనీ కింద ఒక్కొక్క ప్రొఫెసర్‌కు రూ.2లక్షల చొప్పున కేటాయించి మంజూరు చేసినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈప్రాజెక్టులపై అప్పట్లోనే పలు ఆరోపణలు వచ్చాయి. అయితే సీడ్‌మనీ గ్రాంట్ రిలీజ్ చేసినట్లు ఉత్తర్వులు వెలువడ్డప్పటికీ ఎవరికీ నిధులు విడుదల కాలేదని విజిలెన్స్ అధికారుల విచారణలో తేలింది. దీంతో కేయూ అధికారులు నిధులు విడుదల కానట్లు రికార్డులు చూపారు. దీంతో సీడ్‌మని గ్రాంట్ మంజూరు చేసినట్లు ప్రాజెక్టు వర్క్‌లు జరుగుతున్నట్లు కేవలం న్యాక్ గ్రేడ్‌కోసం మాత్రమే చూపారని స్పష్టమైంది. దీంతో న్యాక్‌కు పంపిన ఎస్ఎస్ఆర్ రిపోర్టు సమాచారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లపై..

కేయూలో 2021–2022 పీహెచ్‌డీ అడ్మిషన్లపై ఆరోపణల నేపథ్యంలో.. పీహెచ్‌డీ నోటిఫికేషన్ నిబంధనలు, నోటిఫికేషన్‌లో సీట్‌మ్యాట్రిక్స్ పేర్కొనకపోవడం.. అడ్మిషన్ల నిబంధనల రూపకల్పన, ఏపీ కమిటీల అప్రూవల్ తీసుకుంటారనే అంశాలపై అకడమిక్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. నోటిఫికేషన్‌లో వేకెన్సీలు చూపారు. కానీ, సీట్ మ్యాట్రిక్స్‌ను పేర్కొనలేదని అసిస్టెంట్ రిజిస్ట్రార్ సమాధానం చెప్పారు. మెరిట్‌లిస్టులు పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించిన సమాచారం సంబంధిత విభాగాల డీన్ల వద్ద ఉంటుందని సమాధానం ఇచ్చారు. దీంతో పీహెచ్‌డీ అడ్మిషన్ల నిబంధనల రికార్డులు విజిలెన్స్ అధికారులు జిరాక్స్ తీసుకున్నారు. ఇదిలా ఉండగా ప్రొఫెసర్లకు సీనియర్ ప్రొఫెసర్లకు పదోన్నతుల అంశంపై ఆరా తీసినట్లు సమాచారం. యూనివర్సిటీలో గత వీసీ హయాంలోని రెండేళ్ల ఆడిట్ రిపోర్టు ఇప్పటికే తీసుకోగా మంగళవారం మరో సంవత్సరం రిపోర్టు తీసుకున్నారు.

వర్సిటీ బడ్జెట్ వివరాల సేకరణ..

కేయూ బడ్జెట్‌పై విజిలెన్స్ అధికారులు సంబంధిత అధికారిని ప్రశ్నించగా.. ఏడాదికి రూ.300 కోట్లకు పైగా బడ్జెట్ ఉంటుందని అందులో రూ.130 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి వస్తుందని తెలిపారు. ఎక్కువ వేతనాలకే సరిపోతాయని, మిగతా నిధులు యూనివర్సిటీ సమకూర్చుకుంటుందని సంబంధిత అధికారి వివరించారు. విచారణలో రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బాలకోటి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, హన్నన్, అనిల్, హరిప్రసాద్, ఎఫ్ఆర్ఓ గౌతమ్, ఏఓ శ్రీనివాస్, కేయూ ఐక్యూఏసీ డైరెక్టర్ నర్సింహాచారి, ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత ఉదయ్ చందర్ హఠాన్మరణం

- నివాళులర్పించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, పలువురు ప్రముఖులు



ఉదయ్ చందర్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : జర్నలిస్టు, బీసీ ఐక్య వేదిక ముఖ్యుడు, సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్ (64) గుండెపోటుతో మంగళవారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు సాదుల శ్రీనివాస్, బి.విజయసారథి, ఆయా పార్టీల మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు సూర్నపు సోమయ్య, బి.అజయ్ సారథిరెడ్డి, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు కొండపల్లి రామచందర్ రావు, టీజేఎస్ జిల్లా కన్వీనర్ డోలి సత్యనారాయణ, టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు, అంబటి వీరభద్రం, మేకల వీరన్న యాదవ్, బొడ్డుపల్లి ఉపేంద్రం, కాటా భాస్కర్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, తదితరులు.. ఉదయ్ చందర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు.



పాడెమోస్తున్న వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్

కంటతడిపెట్టిన వేం నరేందర్ రెడ్డి..

చుక్కల ఉదయ్ చందర్‌ను కడసారిగా చూసేందుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికిలోనై కంటతడిపెట్టుకున్నారు. ఉదయ్ చందర్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని విలపించారు. సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియల్లో వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్..ఉదయ్‌చందర్ పాడెమోస్తూ వేల్పుల సత్యం నగర్ కాలనీలోని వైకుంఠధామం వరకు వెళ్లారు.

పండుగకు కొత్త బట్టలు కొనుక్కొని వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రవణ్ రెడ్డి మృతదేహం

భూపాలపల్లి రూరల్: పండుగకు కొత్త బట్టలు కొనుక్కొని వస్తున్న క్రమంలో ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామ మలుపు వద్ద చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం చింతలపల్లికి చెందిన ఐరెడ్డి శ్రవణ్‌రెడ్డి (34) పండుగ కోసం కొత్త బట్టలు కొనుగోలు చేయడానికి మంగళవారం తన ద్విచక్రవాహనంపై భూపాలపల్లికి వచ్చాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామ మలుపు వద్ద తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అతివేగం కారణంగానే ప్రమాదం చోటు చేసుకుని ఉంటుందని చర్చించుకుంటున్నారు. మృతుడికి భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.